# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక :323 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 323 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 27 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

### అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



**పెన్ పవర్ డెస్క్:**గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు బీసీ జనార్దన్ ప్రకటన

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



**పెన్ పవర్ డెస్క్:**భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నారు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు



**పెన్ పవర్ డెస్క్:**భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కళ్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో






## వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా? అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు.అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ–బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు.పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు.నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజి తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు."ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు.అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది.వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది.నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం–6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్–బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు.జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు.దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది.ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు.సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్‌గ్ ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# భారీ వర్షాలు, గోదావరి ఆకస్మిక వరదల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు సెలవులు పెట్టరాదు

- ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 26:**ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం, అలాగే గోదావరి నదికి ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పోలీసు, విద్యుత్, నీటిపారుదల, రహదారులు, మున్సిపల్ తదితర అత్యవసర సేవల విభాగాల సిబ్బంది ఎటువంటి సెలవులు పెట్టరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది కూడా వెంటనే తమ విధులు నిర్వహిస్తున్న ప్రధాన కార్యాలయాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది తమ పరిధిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాలు, వరదల పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ అధికారులు తమ సిబ్బంది వివరాలతో పాటు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ సిబ్బంది వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గోదావరి నది నీటిమట్టాలు, వాగులు, కాలువలు, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అత్యవసర వైద్య సేవలకు సిద్ధంగా ఉండాలని, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు తదితర అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే స్పందించేలా సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత విపత్కర వాతావరణ పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.

## పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కీర్తి చేకూరి బాధ్యతల స్వీకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 26:**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి నూతనంగా తూర్పుగోదావరి జిల్లా పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలు, ఇప్పటివరకు చేపట్టిన కార్యాచరణ, సంబంధిత అధికారులు అందించిన నివేదికలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న తూర్పుగోదావరి జిల్లా పరిషత్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేలా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ పరిధిలో చేపట్టాల్సిన పరిపాలనా, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సేకరించి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాన్ని గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శాశ్వత కార్యాలయ భవనం గుర్తించి ఏర్పాటు చేసే వరకు తాత్కాలికంగా రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, రికార్డులు, పరిపాలనా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను పరిశీలించి, కార్యాలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిషత్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, సిబ్బంది, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలు తదితర వివరాలను నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి, అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలో సంబంధిత ప్రక్రియలను పూర్తి చేసి, నూతన జిల్లా పరిషత్ పరిపాలనా వ్యవస్థను సమర్థవంతంగా అమల్లోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# శబరి పరివాహక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**అధికారులకు జేసీ ఆదేశం**

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 26.** ఒడిశాలో భారీ వర్షాల నేపథ్యంలో శబరి నదికి ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పోలవరం జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు.శుక్రవారం రాత్రి కూనవరం శబరి బ్రిడ్జి వద్ద పరిస్థితి ని,చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా ఉన్నా,నీటిమట్టాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు,కాలువలపై ప్రత్యేక నిఘా ఉంచాలని,ముంపు ముప్పు ఉన్న చోట ప్రజలను ముందుగానే అప్రమ త్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలు,సహాయక సామగ్రి,రవాణా వాహనాలు సిద్ధం గా ఉంచాలని,అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయా లని ఆదేశించారు.ప్రజలు అధికారు ల హెచ్చరికలు పాటించాలి.నదు లు,వాగులు దాటే ప్రయత్నం చేయ వద్దు.అధికారిక సమాచారం మాత్ర మే నమ్మాలని జేసీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నగరంలో హెచ్‌ఏఎం నిధులు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

- 50 మందికి సీఎంరిలీఫ్ చెక్కులు పంపిణీ
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**హైబ్రిడ్ అన్యూటి మోడ్ (టీహెచ్ఏఎం) నిధులతో నగరంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. రహదారులు, డ్రెయిన్లు, సెంట్రల్ మీడియన్లు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నారని వివరించారు. ఈ మేరకు కొత్తపేటలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. నీటిముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ పనుల ఫలితంగా భారీ వర్షం బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. . 35, 36, 39వ వార్డులకు సంబంధించిన ప్రాంతాల్లో మేజర్ కల్వర్టులు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. హైటెక్ బస్‌స్టాండ్ వద్ద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అక్టోబర్ చివరి నాటికి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కంబాలచెరువు జంక్షన్ నుంచి రామచంద్రరావు పేట, తుమ్మలావ ప్రాంతాల వరకు ముంపు సమస్య పరిష్కారానికి సుమారు రూ.25 కోట్లతో పనులు ప్రతిపాదించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించిన సుమారు రూ.300 కోట్ల అభివృద్ధి పనులను దశలవారీగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జేఎన్ రోడ్డులో డ్రైన్ నిర్మాణానికి సుమారు రూ.1.80 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. వీఎల్ పురం ప్రాంతంలో రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అన్నపూర్ణమ్మపేట గేట్ నుంచి రెల్లిపేట వరకు, . 29వ వార్డులో గేట్ నుంచి సోమాలమ్మ తల్లి ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.63 లక్షలు మంజూర య్యాయన్నారు .జాంపేట బ్రిడ్జి నుంచి గీతా అప్సర, రంబా థియేటర్ ప్రాంతం, డీలక్స్ సెంటర్ మీదుగా నాగుల చెరువు మార్కెట్ జంక్షన్ వరకు 28, 29, 33వ వార్డులను కలిపే బీటీ రోడ్డుకు రూ.1.07 కోట్లు మంజూర య్యాయని తెలిపారు. నగరంలో ముంపు సమస్య ఉన్న ప్రతి ప్రాంతాన్ని గుర్తించి ప్రణాళికాబద్ధంగా డ్రైనేజీ, కల్వర్టులు, రోడ్ల ఎత్తు పెంపు వంటి పనులు చేపడుతున్నామన్నారు. క్రీడా మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. వీఎల్ పురం ప్రాంతంలో ఖేలో ఇండియా నిధులతో రూ.14 కోట్లతో అరేనా-2 నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2027 ఫిబ్రవరిలో అరేనా-2ను ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అరేనా-1కు సుమారు రూ.28 కోట్లతో అక్టోబర్ చివరి నాటికి టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అరేనా-1, అరేనా-2 కలిపి సుమారు రూ.54 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పుష్కరాల నాటికి రెండు అరేనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక 50వ వార్డులో సుమారు రూ.35 లక్షలతో స్పోర్ట్స్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాసు తెలిపారు. సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టు, కబడ్డీ, వాలీబాల్ కోర్టు, జిమ్ పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఉంటాయని చెప్పారు. జీఎస్టీ కార్యాలయం వెనుక ఉన్న టెన్నిస్ కోర్టుల అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిం చినట్లు తెలిపారు. టెన్నిస్‌తో పాటు పికిల్‌బాల్ కోర్టులను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎస్కేవీటీ కళాశాలలోని బాస్కెట్‌బాల్ కోర్టు అభివృద్ధికి శాప్ నుంచి రూ.20 లక్షల అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ వచ్చినట్లు ఎమ్మెల్యే వాసు వెల్లడించారు.

డీఎస్సీ నియామకాలలో వైసీపీ చేస్తున్న విమర్శలను ఆదిరెడ్డి శ్రీనివాస్ తప్పుబట్టారు. డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. .

**819 మందికి రూ.6.78 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ సాయం**

సిటీ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో 819 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మొత్తం రూ.6,78,12,779 విలువైన చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం 47 చెక్కులు, 3 ఎల్ఓసీలు కలిపి రూ.34,22,334 విలువైన చెక్కులు అర్హులకు అందచేశామని, ఇంకా 123 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటి విలువ సుమారు రూ.1.70 కోట్లు అని వెల్లడించారు.గెయిల్ సహకారంతో రూ.30 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ఈ నిధులతో బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, అంధులకు వాకింగ్ స్టిక్స్ తదితర పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 3న ఉదయం 9.30 గంటల నుంచి జేఎన్ రోడ్డులోని వి కన్వెన్షన్ హాల్‌లో జరిగే క్యాంప్‌కు వచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. ఎమ్మెల్యే సూచించారు. 42 వార్డుల నుంచి అర్హులైన వారు తమ ధ్రువపత్రాలతో వచ్చి వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలకు 100 శాతం సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. కార్పొరేషన్‌కు సంబంధించిన కొన్ని న్యాయపరమైన అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. మేయర్ అభ్యర్థిపై ఇప్పటివరకు తుది నిర్ణయం లేదని చెప్పారు. ఎన్నికల అంశాలపై టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల నాయకులతో సమన్వయంతో వెళ్తామని తెలిపారు. కార్పొరేటర్ స్థానాలలో గెలుపు అవకాశాలు, స్థానిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. అనంతరం 50 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పంపిణీ చేశారు. కూటమి నాయకులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# నేడు నగరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు




- గోదావరి పుష్కరాలే లక్ష్యంగా ది గోదావరి కాల్స్' ప్రచారం
- మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**తొలిసారిగా నగరంలో వేదికగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం హుకుంపేట కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకల వివరాలను వెల్లడించారు. రాజమండ్రిలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంజీరా హోటల్ లో జరిగే వేడుకలకు జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామా నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అన్నారు.

**ఏఐ సాంకేతికతతో పర్యాటకాభివృద్ధి...**

సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పర్యాటకాభివృద్ధిని, ఇకపై ఏ ఐ సాంకేతిక ఆధారితంగా మారుస్తున్నట్లు దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని 130 పర్యాటక ప్రాంతాల్లో 130 భాషల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా ఆయా ప్రాంతాల సమా చారాన్ని, విశిష్టత పర్యాటకులకు అందుబాటు లోకి తెస్తున్నట్లు దుర్గేష్ వెల్లడించారు. ఇన్ఫ్లుయెన్సర్లు, క్రియేటర్ ల ద్వారా ప్రచారం..పర్యాటక ప్రాంతాలకు వచ్చే యాత్రికులను ఆకర్షించేందుకు క్రియేటర్లతో, ఇన్ఫ్లుయె న్సర్లతో రీల్స్ చేయించి ప్రదర్శించనున్నామన్నారు. హాఫ్ ఆన్, హాఫ్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిం చారు. ఆ బస్సుల్లో ఇన్ఫ్లుయెన్సర్లు పర్యాటక ప్రాంతాలపై రీల్స్ తయారు చేసి విశ్వవ్యాప్తం చేస్తారని తెలిపారు.

**క్రూజ్,కారవాన్ టూరిజం...**

సముద్రంలో కార్డెలియా క్రూజ్ ను విశాఖ-చెన్నై-పాండిచ్చేరి మధ్య ప్రారంభించామన్నారు. కాకినాడ తీరం నుండి హోప్ ఐల్యాండ్, కోరింగ, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో రివర్ క్రూజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కారవాన్ టూరిజం, హోమ్ స్టేలు, టెంట్ సిటీలతో వినూత్నంగా వెళ్తున్నా మన్నారు.

**రూ.430 కోట్లతో కేంద్ర ప్రభుత్వ సహకార ప్రాజెక్టులు...**

కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ.428 కోట్ల నిధులు మంజూరయ్యాయని అన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 క్రింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 97.52 కోట్లు,బొర్రా గుహలకు రూ. 29.87 కోట్లు,సాస్కి క్రింద అఖండ గోదావరి పునరుద్ధరణకు రూ. 94.44 కోట్లు, గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, ప్రసాద్ స్కీమ్ కింద అన్నవరం దేవస్థానానికి రూ. 25.32 కోట్లు, సింహాచలంకు రూ. 54.04 కోట్లు, సీబీడీడీ క్రింద అహోబిలం స్పిరిచువల్ ఒడిస్సీకి రూ. 24.96 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ సర్క్యూట్‌కు రూ. 25 కోట్లతో పర్యాటక అభివృద్ధి చేస్తున్నామన్నారు. బొర్రా గుహల్లో లైట్ అండ్ సౌండ్ షోలు, పర్యాటక ప్రాంతాల్లో 3, 5, 7 స్టార్ హోటళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రసాద్ స్కీం క్రింద అరసవిల్లి దేవాలయాన్ని కేంద్ర సహకారంతో అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించామన్నారు. తిరుపతి, విశాఖపట్నంను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలుగా కేంద్రం అంగీకరించిందని స్పష్టం చేశారు. కేరళ కోవాళం బీచ్ తరహాలో ఏపీలోని సుదీర్ఘ సముద్ర తీరంలో వెల్ నెస్ సెంటర్ల (ఆయుర్వేదం, యోగా) ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**రుషికొండ ప్యాలెస్ వినియోగంపై తుది నిర్ణయం..**

ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆమోదంతో రుషికొండ ప్యాలెస్ వినియోగంపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా, సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడి విశాఖలో గ్రామసభ నిర్వహించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందన్నారు. తాజ్ గ్రూప్, లీలా గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ ముందుకు వచ్చాయని వెల్లడించారు. గత పాలకులు ఇష్టారీతిన నిర్మించారని, వ్యక్తిగత కోసం విలాసవంతంగా నిర్మించారని విమర్శించారు. గతంలో రుషికొండ రిసార్టుల ద్వారా ఏటా రూ.15 కోట్లు ఆదాయం వచ్చేదని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పర్యాటకశాఖ ఆదాయం కోల్పోయిం దన్నారు. 2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా, నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. పుష్కరాలకు ముందస్తు అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'ది గోదావరి కాల్స్' కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. తెలుగు కళా వైవిధ్యాన్ని ప్రదర్శించ బోతున్నట్లు చెప్పారు. బ్రిడ్జిలంకలో టెంట్ సిటీలు, వాటర్ ఫ్రంట్ గేమ్స్, పోలవరం ప్రాజెక్టు గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం వల్ల పెట్టు బడి దారులు ముందుకు వస్తున్నారని, భూ కేటాయింపుల పాలసీ ద్వారా పారదర్శకంగా భూములు కేటాయిస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రోడ్ షోలు నిర్వహించి విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. ధవలేశ్వరం పిచ్చుకలంకలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉందని తెలిపారు. అనపర్తికి చెందిన వారు ఫిల్మ్ స్టూడియో, స్టార్ హోటల్, రిసార్ట్ ఏర్పాటుకు ముందుకు రాగా.. చైతన్యరాజు, గన్నీ భాస్కర్ రావు సొంత స్థలంలో రిసార్ట్ ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఎకో టూరిజం పై వివిధ శాఖలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుం టున్నట్లు తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఇండియన్ టూర్ ఆపరేటర్స్ కార్యక్రమం వల్ల పలువురు ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకుంటు న్నామన్నారు.

# ఎర్రకాలువ ముంపు పొలాలను పరిశీలించిన వడ్డి రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 26:**తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో... తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నందమూరు, మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం గ్రామాల్లో పర్యటించిన వడ్డి రఘురామ్ నాయుడు... ఎర్రకాలువ ముంపుతో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

పొలాల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తూ... రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టాన్ని, పెట్టుబడుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముంపు కారణంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు తమ ఆవేదనను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంట నష్టం మాత్రమే కాకుండా... పంట కోసం చేసిన పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వివరించారు.

ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ... ముంపు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో ఎంత మేరకు నష్టం జరిగిందో అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని కోరారు.

రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా... ముంపు ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేయాలని అన్నారు.

నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని... పంట నష్టం పరిహారం విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయకూడదని డిమాండ్ చేశారు.

**ఒక్క పార్టీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారం కంటే... మూడు పార్టీలు మూడు రెట్లు ఇవ్వాలి**

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగిన సమయంలోనే పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వడ్డి రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నాయని ప్రస్తావిస్తూ... గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం కంటే ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మూడు రెట్లు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని కోరారు. రైతులు మళ్లీ తదుపరి పంట సాగు చేసుకునే పరిస్థితి కల్పించాలంటే ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు.నందమూరు అక్విడెక్ట్ ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్కను తొలగించాల్సిన అవసరం ఉందని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు.

గుర్రపు డెక్కను ముందుగానే తొలగించి ఉంటే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అక్విడెక్టులు, కాలువలు, డ్రెయిన్లు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వరదలు వచ్చిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే... ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని కోరారు.

**ప్రతి ఏడాది ముంపే... ముందస్తు చర్యలు ఏమిటి?**

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఈ ప్రాంతాలు ప్రతి ఏడాది వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పుడు... ముంపును నివారించేందుకు ప్రభుత్వం ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకుంటోందో చెప్పాలని ప్రశ్నించారు. కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల శుభ్రత, అక్విడెక్టుల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ముందుగానే దృష్టి పెట్టాలని అన్నారు. ముంపు వచ్చిన తర్వాత ప్రాంతాలను సందర్శించడం కంటే... ముంపు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలపై విమర్శలు ముంపు సమస్యపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు తగిన స్థాయిలో స్పందించడం లేదని వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి... పంట నష్టాన్ని నమోదు చేసి, సంబంధిత అధికారులకు నివేదికలు పంపి, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

**యూరియా బ్లాక్ మార్కెట్‌పై ఆగ్రహం**

ఇదే సమయంలో రైతులకు అవసరమైన యూరియా విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని... అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు మరోవైపు ఎరువుల సమస్య కూడా ఎదురైతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. ఫార్మాలిటీ కోసం వచ్చి ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాదు ముంపు ప్రాంతాలను సందర్శించడం కేవలం ఫార్మాలిటీగా మారకూడదని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రాంతానికి వచ్చి రైతులతో మాట్లాడి, ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాకుండా... వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

రైతుల పొలాల్లోకి నీరు ఎందుకు చేరుతోంది...? నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి...? వాటిని శాశ్వతంగా ఎలా పరిష్కరించాలి...? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా అధ్యయనం చేయాలని అన్నారు.

**రూ.25 వేల నుంచి రూ.30 వేల తక్షణ సాయం ఇవ్వాలి**

ముంపుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతులు ఎదురుచూసే పరిస్థితి లేకుండా... అత్యవసర సాయంగా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా పూర్తి స్థాయి పంట నష్టాన్ని అంచనా వేసి... ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**రైతుల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వడ్డి రఘురామ్ నాయుడు కోరారు. ముంపు ప్రాంతాల్లోని రైతులకు న్యాయం చేయకపోతే... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రైతుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. రైతుల పంట నష్టం, ముంపు సమస్య, ఎరువుల సమస్య, నష్టపరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ ముంపు సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా... శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. నందమూరు నుంచి మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం వరకు ముంపు ప్రభావిత ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి... రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతుల పంటను కాపాడటంతో పాటు... నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించి, భవిష్యత్తులో ముంపు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణం తొలగించాలి.

- పి సి సి ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కొండ శ్రీను డిమాండ్.



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26 :-**జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తొలగించాలి అని తొలగించడమే కాకుండా అరెస్ట్ చేసి విచారణ చేసి భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కొండ శ్రీను డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి గోకవరంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజ్యాంగంలో ఎన్నికల కమిషనర్ ని నిర్మించే బాధ్యత ఒక ప్రధానమంత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపక్ష నాయకుడు సమక్షంలో జరగాలని ఉన్న ఆ ప్రతిరేఖ తూట్లు పొడిచి బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి ఆ ప్రక్రియ నుంచి ప్రధాన న్యాయమూర్తులు తప్పిస్తూ సీనియర్ క్యాబినెట్ మంత్రిని నియమిస్తూ చట్టం చేసింది ఎందుకనగా ఈ బీజేపీ ప్రభుత్వం ఎన్నికైన కమిషనర్ అడ్డుపెట్టుకుని ఓట్ల దొంగతనం చేసి అక్రమంగా అధికారంలో ఉండాలని ఆలోచనతో ఇటువంటి రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యతిరేకంగా విధానాలు చేపట్టింది అంతేకాక ఎన్నికల కమిషనర్లుగా ముగ్గురు నియమించింది ఆ ముగ్గురిలో ఇద్దరు కమిషనర్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకునే నిర్ణయాలు తప్పు అని పది రోజుల్లో 14 సార్లు లిఖిత పూర్వకంగా కంప్లైంట్ చేసిన పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఎస్ ఐ ఆర్ లు కొత్త నిబంధనలు తీసుకొచ్చి దేశంలో అర్హులైన వాటర్ ని కూడా తొలగించి బిజెపి అనుకూలంగా ఉన్న దొంగ ఓట్లు జాయిన్ చేసి ఓట్లు దొంగతనం పాల్పడిందని కేంద్ర ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారు ఎన్నోసార్లు ముందుగానే హెచ్చరించారు కానీ ఆయన మాటలు పట్టించు కోకుండా ఈ ఓట్ల దొంగలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నియస్తామని తెలిసి ముందుగానే రాజ్యాంగ సవరణలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పై రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఇటువంటి కేసులు పెట్టడానికి లేదు విచారించటానికి లేదని ఒక చట్టాన్ని తీసుకొచ్చి ఆ తరువాత జ్ఞానేష్ కుమార్ ని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా నియమించారని తద్వారా అనేక రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దొంగ ఓట్లు అధికరణకు వచ్చిన బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెలుసుకుని జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించి అతని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేదా అత్యున్నని స్థానం సుప్రీం కోర్ట్ ఈ ప్రభుత్వంపై ఎన్నికల కమిషనర్ పై రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టాలని జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం తరఫున ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి కాకినాడ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొండ శ్రీను డిమాండ్ చేశారు.

## క్రమశిక్షణ, పట్టుదలతో విజయాలు సాధించాలి

- విద్యార్థులకు చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ పిలుపు



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 26:**విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత విజయాలు సాధించాలని చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ పిలుపునిచ్చారు. కాగుపాడు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెలిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన పెట్ల పార్వతీ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సుమారు రూ.10 వేల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యా రంగంలో పెట్ల పార్వతీ స్మారక సేవా సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు.

మండల విద్యాశాఖాధికారి సాయిబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని అన్నారు. విద్యా కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

పత్తి వీరస్వామి 'విద్యార్థులు--మానవ సంబంధాలు--నైతిక విలువలు' అనే అంశంపై మాట్లాడారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహనతో పాటు మానవ సంబంధాలను, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.

సంస్థ అధ్యక్షుడు పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రశ్నించడం అభివృద్ధికి మూలమని అన్నారు. ప్రతి విద్యార్థి విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తితో ప్రశ్నించడం అలవర్చుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో గుదే శ్రీనివాసరావు, శీతల సత్యనారాయణ, ఆనంద్‌కుమార్, శ్రీవల్లి తదితరులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు




**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు--2026 ఆదివారం మారేడుమిల్లిలో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక పోలవరం జిల్లా అధ్యక్షులు తీగల బొజ్జయ్య, ప్రధాన కార్యదర్శి పాయం కన్నారావు తెలిపారు. పోలవరం జిల్లాలోని 11 మండలాల్లో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో సైన్స్ టెస్ట్ నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశీలన, విశ్లేషణా సామర్థ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.మండల స్థాయి విజేతలైన విద్యార్థులతో పాటు సంబంధిత సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆదివారం ఉదయం 9 గంటలకు మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని కోరారు.కార్యక్రమానికి ఏపీ యూటీఎఫ్ పోలవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, 11 మండలాల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జన విజ్ఞాన వేదిక పోలవరం జిల్లా కార్యవర్గ సభ్యులు, 11 మండలాల జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు.జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా విజ్ఞాన ఉద్యమ కార్యకర్తలు సహకరించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ శాఖపై మండల ప్రజలు ప్రశంసలు....



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ఆర్నబ్ తుఫాను ప్రభావంతో అడ్డతీగల మండలంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురిసినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా పనిచేసి మండల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించారు. గతంలో వచ్చిన తుఫాన్ల సమయంలో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సరిచేయడానికి అనేక రోజులు పట్టేది. అయితే ప్రస్తుతం విద్యుత్ శాఖ సిబ్బంది ఆధునిక పరికరాలు, సమన్వయంతో కూడిన చర్యలు మరియు వేగవంతమైన స్పందనతో కొన్ని గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు మరియు ఇతర పరికరాలకు అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి అత్యంత వేగంగా మరమ్మత్తు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ సమస్య లేకుండా నిరంతరం విద్యుత్ అందించారు అని మారుమూల ప్రాంతవాసులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అడ్డతీగల విద్యుత్ విభాగం సిబ్బంది 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తూ, ఎటువంటి పెద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా ఏ ఈ సుదర్శన్ పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బంది చూపిన అంకితభావం, వేగవంతమైన స్పందనపై వినియోగదారులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన మరియు నిరంతర విద్యుత్ సేవలు అందించడమే తమ లక్ష్యమని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలని, విద్యుత్ తీగలు తెగి పడినట్లు గమనిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని విద్యుత్ శాఖ రంపచోడవరం ఈ ఈ పి. అచ్యుతాచారి, ఏ డి ఈ గోపాలకృష్ణ, అడ్డతీగల ఏ. ఈ సుదర్శన్ ప్రజలను కోరారు.

## తోతట్టుగ్రామాల్లో అటవీశాఖఅధికారి పర్యటన

అటవీశాఖాధికారి రామకృష్ణ(రేంజర్)



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.26 :** అటవీశాఖసంబంది తఅధికారి,రేంజర్,రామకృష్ణ, అటవీశాఖసిబ్బంది.తోలోతట్టుగ్రామాల్లోపర్యటన చేశారు.లోతట్టుగ్రామాల ప్రజలతోమాట్లాడుతూ మండలంలోనియిపూరు ,కొటారిగోమ్ము,ములకపల్లి, ముత్యాలమ్మగండి,జీడిగుప్ప,తదితరగ్రామాల్లోని ప్రజలువరదలుపెరుగుతున్న,నేపథ్యంలోప్రజలందరూ అప్రమత్తంగాఉండాలని ,కోరారు.వరదలుఉధృతంగా (ఎక్కువగా)వచ్చిరహదారులులేనట్లయితే,ప్రభుత్వం ద్వారావచ్చేనిత్యవసరసరుకులుపరదాలు(టార్ఫ్,ల్) ప్రతిఒక్కకుటుంబానికి ,అందజేస్తామనిహామీఇచ్చారు. ప్రజలందరూ ధైర్యంగాఉండాలని,తమతమపిల్లలను, వరదనీటిలోదిగకుండాజాగ్రత్తగా చూసుకోవాలని, రాత్రి,ఉదయంసమయా ల్లోచేపలువేటకు ఎవరూ వెళ్లకూడదని,సూసించారు.ఈకార్యక్రమంలోఅటవీ శాఖసిబ్బంది.గ్రామస్థులు,తదితరులుపాల్గొన్నారు.

## మలకపల్లిలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవ్



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**సేవా సంకల్పం అభియాన్‌లో భాగంగా మలకపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం--2లో అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్త ఆర్.జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో వివిధ విద్యా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ప్రాథమిక దశలోనే విద్య, ఆరోగ్యం, పోషణ, మానసిక వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో వివరించారు. ఈసీసీఈ డే ప్రాముఖ్యతను తెలియజేస్తూ చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అదేవిధంగా పోషణ మాసోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తదితర పోషకాహార పదార్థాల ప్రాధాన్యతను ప్రదర్శన ద్వారా చిన్నారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎం.భానుమతి, గ్రామ పెద్దలు మద్దిపాటి రామారావు, రాగు చిన్నబ్బులు, అనసూయ, రాగు చిన్ని, అరుణ, గ్రామస్తులు, లబ్ధిదారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరం మండల స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన డ్వామా పిడి.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ :--** మండల పరిషత్ పాలకవర్గం పూర్తయిపోయిన నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. దీనికి సంబంధించి గోకవరం మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ( డ్వామా ) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.నాగ మహేశ్వర రావుబాధ్యతలు చేపట్టారు. శనివారం గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం గోవింద్ సమక్షంలో గోకవరం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎం పీ డీ వో ఎం గోవిందు,మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి శ్రీనివాస్, ఏ పీ వో అప్పల రాజు, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పీ డీ కి శుభాకాంక్షలు తెలిపారు.

## తూర్పు గోదావరి జిల్లా దివ్యాంగులకు 57 ఉచిత మోటారు త్రిచక్ర వాహనాల పంపిణీ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 26:** దివ్యాంగులు స్వయం సమృద్ధి సాధించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల్లో భాగంగా మోటారు త్రిచక్ర వాహనాలను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో దివ్యాంగులకు ఉచిత మోటారు త్రిచక్ర వాహనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో ఆర్థోపెడికల్ వైకల్యం కలిగిన 57 మంది లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసి మోటారు త్రిచక్ర వాహనాలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం పింఛన్లు, సహాయక పరికరాలు, త్రిచక్ర వాహనాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. శారీరక పరిమితులను అధిగమించి స్వయం ఉపాధి, ఉద్యోగం, విద్య తదితర రంగాల్లో ముందుకు సాగుతున్న దివ్యాంగుల పట్టుదల, ధైర్యం, సానుకూల దృక్పథాన్ని అభినందించారు. అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ పనిచేయడానికి వెనుకాడే వారికి దివ్యాంగుల శ్రమ, నిబద్ధత స్ఫూర్తిదాయకమన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగుల ప్రత్యేక అవసరాల సంఘానికి భవనం ఏర్పాటుకు తగిన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులు స్వయం సమృద్ధిగా జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న మోటారు త్రిచక్ర వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రాకపోకల కోసం ఇతరులపై ఆధారపడే పరిస్థితి తగ్గి, స్వయం ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం తదితర కార్యకలాపాలను మరింత స్వేచ్ఛగా నిర్వహించుకునేందుకు ఈ వాహనాలు దోహదపడతాయన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ మోటారు త్రిచక్ర వాహనాల ద్వారా దివ్యాంగుల రాకపోకల పరిధి పెరిగి, స్వయం ఉపాధి చేసుకునేవారు మరింత మంది వినియోగదారులను చేరుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో దివ్యాంగ విద్యార్థులు, వ్యక్తులకు టాబ్లెట్లు, టెక్స్ట్-టు-స్పీచ్ వంటి అనేక సహాయక సాంకేతిక పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయం, సంస్థ, కంపెనీలో దివ్యాంగులకు సమాన అవకాశాలు, సులభ ప్రాప్యత కల్పించేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. దివ్యాంగులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన పరికరాలు, ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. దివ్యాంగుల స్వావలంబన, ఆర్థిక సాధికారత, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మోటారు త్రిచక్ర వాహనాల పంపిణీ ద్వారా దివ్యాంగులు తమ దైనందిన అవసరాలను స్వయంగా నిర్వహించుకోవడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకునే అవకాశం కలుగుతుందన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన లబ్ధిదారు వెలిగండ్ల వీరవేణి మాట్లాడుతూ గతంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, దీంతో రోజువారీగా అధిక మొత్తంలో రవాణా ఖర్చులు భరించాల్సి వచ్చేదని తెలిపారు. ముఖ్యమంత్రి ద్వారా మోటారు త్రిచక్ర వాహనం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్నేహితుల సహాయంతో దరఖాస్తు చేసుకున్నానని, ప్రస్తుతం వాహనం నడపడం పూర్తిగా రాకపోయినా త్వరలో నేర్చుకుని స్వతంత్రంగా ప్రయాణిస్తానని చెప్పారు. ఎం.ఏ, బి.ఎడ్ పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నానని, తన చదువుకు తల్లి ఎంతో సహకరించారని తెలిపారు. స్వయం సమృద్ధిగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది తన లక్ష్యమని పేర్కొన్నారు. రంగంపేటకు చెందిన లబ్ధిదారు బాలాజీ మాట్లాడుతూ బయటకు వెళ్లి అవసరమైన సామగ్రి తెచ్చుకోవడంలో తాను ఇబ్బందులు పడేవాడినని, ప్రభుత్వం అందించిన మోటారు త్రిచక్ర వాహనం తనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వాహనం ద్వారా తన కార్యకలాపాలను మరింత విస్తరించుకుని అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. వాహనం అందించిన ప్రభుత్వం, కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

**పథకం వివరాలు...**

దివ్యాంగుల దైనందిన జీవన పరిస్థితులను మెరుగుపరచి, వారు స్వయం సమృద్ధి సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.10, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, 22 మార్చి 2021 ద్వారా హెల్మెట్‌తో కూడిన మూడు చక్రాల మోటారు పెట్రోల్ స్కూటర్లను ఉచితంగా అందించే పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు, 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం, 10వ తరగతి ఉత్తీర్ణత, వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు లేదా రైస్ కార్డు కలిగి ఉండటంతో పాటు వాహనం నడపడానికి చేతులు అనుకూలంగా ఉన్న దివ్యాంగులు అర్హులు. స్వయం ఉపాధి పొందుతున్నవారికి, ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఈ పథకం జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది.

**జిల్లాలో లబ్ధిదారులు...**

తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు మొత్తం 70 మోటారు త్రిచక్ర వాహనాలు కేటాయించగా, జిల్లా స్థాయి ఎంపిక కమిటీ నిర్వహించిన పరిశీలన, ఇంటర్వ్యూల అనంతరం 57 మంది దివ్యాంగులను ఎంపిక చేశారు. రాజమహేంద్రవరం పట్టణంలో 7, రాజమహేంద్రవరం గ్రామీణంలో 7, రాజానగరంలో 8, కొవ్వూరులో 6, గోపాలపురంలో 6, అనపర్తిలో 11, నిడదవోలులో 12 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు నిర్దేశించిన ప్రాధాన్యతలను పాటిస్తూ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను వాహనాల విడుదల కోసం ఏపీడీఏఎస్‌సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా ఏపీడీఏఎస్‌సీఏసీ సహాయ సంచాలకులు, మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ కే.ఆదిత్య శర్మ, సహాయ సంచాలకులు ఎ.వై.శ్రీనివాస్, దివ్యాంగుల ప్రత్యేక అవసరాల సంఘం ప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన కొవ్వాడ కాజ్‌వే

### ఆరు గ్రామాల ప్రజలు, రైతులకు తప్పని ఇబ్బందులు



**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**దశాబ్దాలుగా తాడిపూడి--రాగోలపల్లి గ్రామాల మధ్య ప్రధాన రాకపోకలకు ఆధారంగా ఉన్న కొవ్వాడ కాలువ కాజ్‌వే ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో చుట్టుపక్కల ఆరు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం మీదుగా నిత్యం ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తుండగా, కాజ్‌వే దెబ్బతినడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నీళ్లు రోడ్డుపై ప్రవహించి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తద్వారా రైతులు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.దీనికి శాశ్వత పరిష్కారం “హై లెవెల్ బ్రిడ్జి” నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాలువలో నీటి ప్రవాహం పెరగడంతో కాజ్‌వే పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రహదారి దుస్థితి తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంలో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయిన సమయంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితర నాయకులు, అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కాజ్‌వే సమస్యను పరిష్కరించడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారని రైతులు చెప్పారు. అయితే ఆ హామీలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూడా కొవ్వాడ కాజ్‌వే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఎన్నికలు పూర్తయిన తరువాత కూడా సమస్య అలాగే ఉండిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు వద్ద రైతులు, స్థానికులు తమగోడుని విన్నవించుకున్నారని ఆయన అన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే కాజ్‌వే పరిస్థితిని పరిశీలించి, నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని నామా కొండబాబు విజ్ఞప్తి చేశారు. ప్రజలు, రైతుల రాకపోకలకు అత్యంత కీలకమైన ఈ మార్గాన్ని నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ఇకనైనా ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన అన్నారు.

## తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ స్వరాజ్యలక్ష్మి,




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 26.**ప్రభుత్వ మద్యం విధానం 2026-27 అనుసరించి ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాలను రెన్యువల్ కు అవకాశం కల్పించగా తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో రెండు మద్యం దుకాణములు రెన్యువల్ చేసుకొని కారణంగా వాటికి నోటిఫికేషన్ విడుదల చేయడమైనది అని అలాగే తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో ఒక షాప్ క్రమ సంఖ్య 134 మరియు పెంటపాడు మండల పరిధిలో మరొక షాప్ క్రమ సంఖ్య 120 వెరసి రెండు మద్యం దుకాణం లు 2026-27 కాలానికి నిర్వహణ కొరకు ఆసక్తిగల వారు పొందుటకు నోటిఫికేషన్ వెలువడింది.

ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా గాని ఆఫ్ లైన్ ద్వారా గాని హైబ్రిడ్ విధానంలో గాని ఒక్కొక్క దరఖాస్తునకు మూడు లక్షల రూపాయలు చొప్పున చెల్లించి డ్రా లో పాల్గొనుటకు చివరి తేదీ అక్టోబర్ 1 గా నిర్ణయించడమైనది, ఒక్కొక్క షాప్ నకు కనీసం 4 దరఖాస్తులు రావలెను, 4 లేదా అంతకన్నా ఎక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు మాత్రమే లాటరీ తీయబడును. అక్టోబర్ 5వ తేదీన ఉదయం 8 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో దరఖాస్తు చేసిన సభ్యుల సమక్షం లో లాటరీ తీసి లైసెన్సీదారుల ఎంపిక జరుగును అని తెలిపారు.

ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటలో మీకు ఏమైనా సందేహాలు ఉన్నా, మరి ఏదైనా ఇతర వివరము ల కొరకు స్టేషన్ కార్యాలయం నందు సంప్రదించ వలసినది గా కోరుచున్నాము అని తాడేపల్లిగూడెం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రొహిబిషన్, ఈ. స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

# గోకవరంలో విద్యా కమిటీ ఎన్నికల్లో కూటమి కె విజయావకాశం..!





✷ వైసీపీలో సరైన నాయకత్వం లేక కేడర్ నిస్తేజం..!

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:-** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం జరగనున్న విద్యా కమిటీ (తల్లిదండ్రుల కమిటీ )ఎన్నికలకు గోకవరం మండలంలో రంగం సిద్ధమైంది.గోకవరం మండలంలో 90% నుండి 100% స్థానాలను కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) కైవసం చేసుకునే అవకాశం ఉందని పలువురు తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఒక రెఫరెండం గా మారనుంది.తెలుగుదేశం పార్టీ ఈ చిన్న ఎన్నికను కూడా చాలా సీరియస్ గా తీసుకుంది.పార్టీ మండల నాయకత్వం ఆధ్వర్యంలో మండలస్థాయి నాయకులు కేడర్ తో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఇలాంటి చిన్న ఎన్నికలను కూడా సీరియస్ గా తీసుకోవాలని రేపు జరగబోయే స్థానిక ఎన్నికలకు ఇదే పునాది అని కేడర్ కు దిశానిర్దేశం చేశారు. క్రమ శిక్షణ, సమన్వయంతో ముందుకు వెళ్లడమే కూటమికి కలిసి వచ్చే అంశంగా విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా పార్టీకి అవకాశం ఉన్నా, సరైన కేడర్ లేకపోవడం, సమన్వయం చేసే నాయకుడు లేకపోవడం పెద్ద మైనస్ గా మారింది.అధినేత జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి ఎన్నికలో పోటీ చేయాలని చెబుతున్నా, ఇక్కడ మాత్రం విద్యా కమిటీ ఎన్నికలే కదా నెగ్గకపోయినా పర్వాలేదు, మా కుర్చీలు పదిలంగా ఉన్నాయి అనే మేకపోతు గాంభీర్యంతో కొందరు నాయకులు వ్యవహరిస్తున్నారని వైసీపీ అభిమానులే వేదనతో వాపోతున్నారు.ఏ ఒక్క గ్రామంలో కూడా పార్టీ సమావేశం, కార్యకర్తల సమన్వయం జరగలేదు దీంతో పార్టీ క్యాడర్ పూర్తిగా స్తబ్దుగా ఉండిపోయింది. ఈ లోటు ఇప్పట్లో తీరే అవకాశం కనిపించడం లేదని పలువురు అంటున్నారు.ఒక క్రమశిక్షణ కలిగిన, విధేయత గల కార్యకర్తలు,నాయకత్వంతో ముందుకు వెళితే ఏ పార్టీ అయినా సాధిస్తుంది. నియంతృత్వంతో వెళితే ఏ పార్టీ కూడా ప్రజా కోర్టులో నిలబడి గెలిచే అవకాశం ఉండదు. దీనికి రేపు జరగనున్న విద్యా కమిటీ ఎన్నికలే కాకుండా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కూడా గోకవరం మండలంలో నిదర్శనంగా నిలవబోతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.ఏది ఏమైనా మంగళవారం ఉదయం గోకవరం మండలంలో అందరూ సైకిల్ ఎక్కే అవకాశం ఉందని, ప్రభుత్వ బడి గంట కూటమే మోగించనుందని, అందరూ ధీమాగా ఉన్నారు. అన్నట్టు కూటమి ప్రభుత్వానికే వదిలేస్తారా అవకాశం ఉన్నచోట అన్న పోరాడి నిలుస్తారా ఏం జరుగుతుందో మంగళవారం వరకు వేచి చూడాలి.

## రాజమహేంద్రవరం 4వ ఐఆర్ బెటాలియన్ సెంటర్‌లో ఘనంగా ముగిసిన పోలీస్ శిక్షణా కార్యక్రమం

**2025--26 బ్యాచ్‌కు చెందిన 138 మంది ఎస్‌సీటీపీసీల పాసింగ్ అవుట్ పరేడ్**





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 26:**రాజమహేంద్రవరం 4వ ఐఆర్ బెటాలియన్ సెంటర్‌లో 2025--26 బ్యాచ్‌కు చెందిన 138 మంది ఎస్‌సీటీపీసీల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమశీలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ కి 4వ ఐఆర్ బెటాలియన్ కమాండెంట్ పి.సత్తిబాబు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. పోలీస్ శాఖలోకి నూతనంగా అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లు ప్రజల పట్ల బాధ్యత, అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని విధుల్లోకి అడుగుపెడుతున్న ప్రతి ఒక్కరికి, వారి తల్లి తండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. శిక్షణలో పొందిన నైపుణ్యాలను భవిష్యత్తులో విధుల్లో సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని పోలీసు అధికారులు సూచించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ట్రైనీ పోలీసులకు అభినందనలు తెలిపారు. శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ కానిస్టేబుళ్లను మంత్రి చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు.ు బెస్ట్ ఇండోర్ 1వ బెటాలియన్ బి.నవీన్, బెస్ట్ అవుట్‌డోర్ 1వ బెటాలియన్ ఏ.రాము నాయుడు, బెస్ట్ ఫైరర్ 1వ బెటాలియన్ ఎల్. శ్రీను, బెస్ట్ ఆల్‌రౌండర్ 4వ బెటాలియన్ వి.నవీన్ లు మంత్రి అభినందించారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమశీలో అదనపు ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, సౌత్ జోన్ డిఎస్పి ఏ.శివ ప్రియ, అసిస్టెంట్ కమాండెంట్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌సీటీపీసీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మొల్లేరులో ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా గంగవరం మండలం మొల్లేరు గ్రామంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా మొల్లేరు గ్రామంలోని అంగన్వాడీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్ఎస్ఎస్‌కు చెందిన బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం గోసేవ కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులకు గోవులను అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశి విశ్వనాథరెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సూర్యచంద్రరావు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఆవాల దుర్గాప్రసాద్, మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేడిశెట్టి వెంకటరత్నంతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో నంది అవార్డుల ప్రదానోత్సవం



రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా నిరాదరణకు గురైన కళారంగానికి కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తెస్తోందని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. డిసెంబర్‌లో విజయవాడ లేదా అమరావతిలో నంది ఫిల్మ్ అవార్డులు, తిరుపతిలో నంది టీవీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరిలో తెనాలిలో నంది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహించడంతో పాటు నాటకరంగ కళాకారులకు కందుకూరి పురస్కారాలు అందిస్తామన్నారు.ఇప్పటికే చాలామంది కవులు, కళాకారులను ఉగాది పురస్కారాలతో పాటు బోయి భీమన్న, గుర్రం జాషువా, గిడుగు రామమూర్తి పంతులు వంటి మహానుభావుల పేరిట అవార్డులు అందజేసి సత్కరించమన్నారు.

### కూటమి ధర్మం పాటిస్తూనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ

కూటమి ధర్మాన్ని పాటిస్తూనే అక్టోబర్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు.ఆయా పార్టీలకు విడిగా, కూటమికి విడిగా సమన్వయ కమిటీలు ఏర్పాటయ్యాయని, తరుచూ ఆ భేటీల్లో పాల్గొని బలబలాలు చర్చిస్తున్నామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఉండ్రాజవ రంలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుపై స్పందిస్తూ, అందరికీ ఆమోదయోగ్యమైన అనువైన స్థలాన్ని గుర్తించామని ఎలాంటి వివాదం లేదని తేల్చిచెప్పారు. రాజమహేంద్రవరంలో 138 మందితో కూడిన ఇండియన్ రిజర్వ్ దళానికి శిక్షణ పూర్తయిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. సైబర్ క్రైమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలతో పాటు, మానవ విలువలపై శిక్షణ పొందారని విధుల్లోకి చేరతారని వెల్లడించారు.

రాజమండ్రి కార్పొరేషన్ కి ఎన్నికలు అక్టోబర్లో ఎన్నికలు జరుగుతాయని గ్రామాల విలీనంతో జరిగిన జరగకపోయినా విడిగా నైనా జరుగుతాయన్నారు.

## కొప్పిశెట్టివారి వీధిలో ఘనంగా అన్నసమారాధన



**పెన్ పవర్, ద్వారకాతిరుమల, సెప్టెంబర్ 26:**ద్వారకాతిరుమల స్థానిక గ్రంథాలయం సెంటర్‌లో కొప్పిశెట్టివారి వీధి ఐదో వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ విఘ్నేశ్వర యూత్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 5 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమన్వయం, సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా వీధిలో భక్తి వాతావరణం నెలకొంది.

## ఆకస్మికంగా మృతి చెందిన టాక్సీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 26.**ఇటీవల టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఊరేగింపు కార్యక్రమంలో టాక్సీ డ్రైవర్ ఏసు ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మృతి చెందిన ఏసు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి బొలిశెట్టి శ్రీనివాస్ మరియు పైబోయిన వెంకట్రామయ్య కలిసి రూ.1,00,000/- ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు, స్థానిక నాయకులు, టాక్సీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపికార్యకర్త విద్యుత్తుషాక్,కుగురి



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.26:**మండలంలోని వడ్డిగూడెంగ్రామానికిచెందిన ముత్యాలభవాని(టిడిపికార్యకర్త)అనేమహిళ, గృహముఆవరణలోదు స్తులుఆరేస్తుండగాహఠాత్తుగా విద్యుత్తుషాక్,కుగురి కావడంతోవారిబంధువులుహు టాహూటీనాకూనవరంమండలంలోని కోతులుగుట్ట వైద్యశాలకుతీసుకుపో వడంజరిగింది.ఈవిషయంతెలు సుకున్నతెలుగుదేశంపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,భవానీను,పరామర్శించి,జరిగిన విష యాన్నిఅడిగి తెలుసుకున్నారు. పరామర్శించినవారు బొర్రానరసింహారావు, ముత్యాలచంద్రశేఖర్, ఆదినారా యణ,ముత్యాలశంకర్రావు,చక్రపాణి,తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సీతపల్లి జంక్షన్ లో పోలీసులు వాహనాలు తనిఖీ...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 26;** శనివారం అడ్డతీగల సీతపల్లి జంక్షన్ లో అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి. వినోద్ వారి సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన పత్రాలు సరిలేని వాహనాలకు 2000 రూపాయలు అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ బి. వినోద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన పత్రాలు తప్పనిసరిగా వాహనంలో ఉండాలని వాహనదారులకు సీఐ ఎం. గజేంద్ర కుమార్ అవగాహన కల్పించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ప్రజా సమస్యలను వెలికితీయడంలో మీడియా పాత్ర కీలకం

* మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అభినందనలు



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:–** ప్రజా సమస్యలను వెలికి తీయడంలో మీడియా పాత్ర చాలా కీలక మైనదని జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యవర్గ సభ్యులను సాదరంగా ఆహ్వానించి, ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులపాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు ముఖ్యమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, విద్యుత్, మౌలిక వసతులు వంటి సమస్యలను వార్తల ద్వారా వెలుగులోకి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి జర్నలిస్టులు దోహదపడుతున్నారని అన్నారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులకు పాత్రికేయులు గొంతుకగా నిలవాలని సూచించారు. వార్తలను వాస్తవాధారాలతో, నిష్పక్షపాతంగా అందిస్తూ వృత్తి పరమైన విలువలను కాపాడుకోవాలని చంటిబాబు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, వాటి అమలులో లోపాలను కూడా బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమను సత్కరించి అభినందించిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం..



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 26;** అడ్డతీగల మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని, నిర్వహిస్తున్న 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, శనివారం రాష్ట్ర బిజెపి కార్యదర్శి ఈ .స్వప్న కుమారి ఆధ్వర్యంలో చిత్రలేఖనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డతీగల మండల ఎంఈఓ శ్రీనివాస్ సమక్షంలో అడ్డతీగల జడ్పీ హైస్కూల్, మరియు ఎల్లవరం హైస్కూల్ విద్యార్థులతో చిత్రలేఖన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భీముడుపాకలు మరియు పాపంపేట అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. సమాజానికి సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు, కూటమి కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ ఎక్స్ ఎంపీటీసీ పుడిగి. ఆదిలక్ష్మి, బటాని. వరలక్ష్మి, మహిళా కార్యకర్తలు, కూటమి కార్యకర్తలు ,బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పి.యమ్ స్వనిధి లోక్ కళ్యాణ్ మేళా లో 2615 వీధి వ్యాపారస్తులకు రుణాలు

- మెప్మా పిడి టి. కనక రాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** పి.యమ్ స్వానిధి 2.ా పథకములో భాగ0గా అర్బన్ పరిధి లో 2615 వీధి వ్యాపారస్తులను గుర్తి0చి వారికి ఋణాలు మ0జూరు చేయడము జరిగినది. ఈ రోజు స్ధానిక ఆనం కళాకేంద్రం లో పి.యమ్ స్వానిధి 2.ా లో భాగముగా వీధి వ్యాపారస్తులకు లోన్ మంజూరు చేసిన చెక్కులు పంపిణీ చేయడము జరిగినది స్వానిధి పథకములో వీధి వ్యాపారస్తులకు మెదటి విడతగా 1233 మంది లబ్ది దారులకు 1.84 కోట్లు , రెండవ విడతగా 330 మంది లబ్ది దారులకు 0.83 కోట్లు మూడవ విడతగా 1072 మంది లబ్ది దారులకు 5.36 కోట్లు మంజూరు చేయడమైనది. నగరంలో మిగిలిన వీధి వ్యాపారస్తులు రుణ ధరఖాస్తు లు చేసుకొనుట కోరకు నగర పాలక సంస్థలోని మెప్మా విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు శ్రీదేవి, ఫణి కుమార్, సిటీ మిషన్ మేనేజర్ శ్రీమతి వి. రామలక్ష్మి, టి.యమ్.సి సాయి కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు , స్ట్రీట్ వెండర్స్ ప్రెసిడెంట్ యన్ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి రహదారుల పనులు పూర్తి చేయాలి



* జిల్లాలో రూ.160 కోట్ల ఆర్‌అండ్‌బీ పనులకు ప్రతిపాదనలు
* కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గోదావరి పుష్కరాలకు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ప్రధాన రహదారుల విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి, పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, క్షేత్ర స్థాయి పరిశీలనతో పనుల సాధ్యాసాధ్యాల నిర్ధారణ, వాటి ప్రాధాన్యత అంశాలను అనుసరించి పనులు చేపట్టాలని ఆదేశించారు. పుష్కరాల కు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారుల విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి, పనులకు సంబంధించి రూ.160 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రెండు, మూడు పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో కొన్ని అంశాలను పరిశీలించాల్సి ఉన్నందున, సమన్వయ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను నిర్ధారించాలని సూచించారు. పరిశీలన అనంతరం అవసరమైన చర్యలను చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పోలీసులు, ట్రాఫిక్ అధికారులు, ఇతర శాఖల అధికారులు గుర్తించిన ప్రాంతాలతో పాటు కొత్తగా ప్రతిపాదించిన రహదారి పనులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు మేర ప్రతిపాదనలను నిర్ధారించాలని కమిషనర్ ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులు జిల్లాలో రహదారుల విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనుల పురోగతిపై కమిషనర్ రాహుల్ మీనా సమీక్షించారు. ఎన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయి, చేపట్టిన పనుల పురోగతి , క్షేత్రస్థాయి అవరోధాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రహదారుల ఆక్రమణలు, క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగర పరిధిలో చేపట్టాల్సిన రహదారుల విస్తరణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మహేష్, మనోజ్, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈలు మదర్షా అలీ, మాధవి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో నూతనంగా ముకుంద జ్యువెలరీ షోరూం ప్రారంభం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** తెలుగు రాష్ట్రాల్లో ఫస్ట్ ఎవర్ ఫ్యాక్టరీ ఔట్లెట్ గా పేరున్న ముకుంద జ్యువెలరీ నగరంలో స్థానిక తిలక్ రోడ్ లో శనివారం ప్రారంభమైంది. ఈ షోరూమ్ ను నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంటే ఇటువంటి ఇటువంటి భార్య షో రూమ్ లో ఏర్పడడం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి, స్థానిక సంస్థలకు ఆదాయము లభిస్తుందని అన్నారు. కోస్తా ఆంధ్రాలో వాణిజ్య విద్య వైద్య రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న నగరంగా పెట్టుబడిదారులు రావడం అభినందనీ యమన్నారు ముకుంద జ్యువెలర్స్ చైర్మెన్, బత్తి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 13 వ షో రూమ్ ను ప్రారంభించా మన్నారు. ప్రారంభం సందర్భంగా బంగారు ఆభరణాల మీద ఉన్న తరుగు 6.99 శాతం, మేకింగ్ చార్జెస్ లేకుండా అందుబాటులో తగ్గింపు వినియోగదారులకు అంది స్తున్నామన్నారు. ఈ ఆఫర్ ఈ నెల 26 నుండి అక్టోబర్ 4 వరకు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ముకుంద డైరెక్టర్ లు డాక్టర్ నికిత రెడ్డి , టి కృష్ణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదేవరపేటలో ఘనంగా లడ్డూ వేలంపాట

వినాయకుడి లడ్డూ దక్కితే శుభం జరుగుతుందన్న భక్తుల విశ్వాసం



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో శ్రీ లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలంపాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలంపాటకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. వేలంపాటలో మొదటి లడ్డూను కాకర్ల సత్యేంద్ర దక్కించుకోగా, రెండో లడ్డూను తొండేపు వినోద్ కైవసం చేసుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా లడ్డూ వేలంపాట నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వినాయకుడి లడ్డూను దక్కించుకుంటే మంచి జరుగుతుందనే భక్తుల విశ్వాసంతో భక్తులు ఉత్సాహంగా వేలంపాటలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లడ్డూ విజేతలు కాకర్ల సత్యేంద్ర, తొండేపు వినోద్ మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ లక్ష్మీగణపతి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువత పాల్గొని లడ్డూ వేలంపాటను విజయవంతం చేశారు.

## గంగవరంలో ఘనంగా గణనాథుల శోభాయాత్ర



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుల శోభాయాత్రను శనివారం మండల కేంద్రమైన గంగవరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జడేరు, ఏటపల్లి, కుసుమరాయి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను ఆయా గ్రామాల యువత కమిటీల ఆధ్వర్యంలో శోభాయాత్రగా తరలించారు.

గంగవరం, అడ్డపల్లి, ఏటపల్లి తదితర గ్రామాల మీదుగా సాగిన శోభాయాత్రలో చిన్నారులు, యువతీ యువకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాణాసంచా పేలుళ్లు, యువత కేరింతలు, కోలాటం వంటి సాంప్రదాయ నృత్యాలతో శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. గణనాథులను దర్శించుకునేందుకు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. భక్తుల నినాదాలతో గంగవరం పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.



శోభాయాత్ర అనంతరం గణనాథులను మండల సరిహద్దులోని పెద్దేరు వాగు వద్దకు తరలించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర మార్గంలో ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

## గోకవరం ప్రెస్ క్లబ్ నూతన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు అందిందిన జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:–** ప్రెస్ క్లబ్ లోఉన్న సభ్యులందరూ స్నేహపూర్వకమైన వాతావరణంలో ముందుకు సాగాలని గోకవరం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. గోకవరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పడిన నేపథ్యంలో శనివారం ది గోకవరం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ మర్యాదపూర్వకంగా జగ్గంపేట రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిశారు. గోకవరం మండల పెద్దలతో ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పలు సూచనలను ఎమ్మెల్యేకే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో ప్రతి ఒక్కరు రాణించాలని, నియోజవర్గ స్థాయిలో ఉన్న రిపోర్టర్లు జిల్లా స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. నాయకులు, పెద్దలు మరియు ప్రెస్ క్లబ్ సభ్యులు అభ్యర్థుల మేరకు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపి కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, గోకవరం మాజీ సొసైటీ చైర్మన్ దాసరి తమ్మన్న దొర, జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి బాబు,మాజీ జడ్పీటీసీ పాలూరి బోసుబాబు, మండిగ గంగాధర్,నాగం వెంకటపతి, బొట్టా రామకృష్ణ,చింతల నాగు తదితరులు పాల్గొన్నారు.

## షాట్‌పుట్‌లో రజతం సాధించిన తేజిందర్‌పాల్ సింగ్: గుల్వీర్-యూనస్ 1500m ఫైనల్‌కు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడలలో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనలతో పతకాల పంట పండిస్తున్నారు. తాజాగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ మరోసారి తన సత్తా చాటింది. షాట్‌పుట్ విభాగంలో తేజిందర్‌పాల్ సింగ్ తూర్ రజత పతకం సాధించగా, స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 200 మీటర్ల ఫైనల్‌కు దూసుకెళ్లారు. అలాగే మిడిల్ డిస్టెన్స్ రన్నర్లు కూడా పతకం రేసులోకి దూసుకెళ్లారు.

**షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ రజతం:**

పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌లో భారత స్టార్ అథ్లెట్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. తన ఐదో ప్రయత్నంలో 20.64 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇరాన్‌కు చెందిన మొహమ్మద్‌రెజా తయేబిసే 20.81 మీటర్ల గేమ్స్ రికార్డు త్రోతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. గతంలో 2018 జకార్తా, 2022 హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లో వరుసగా స్వర్ణాలు గెలిచిన తూర్.. తాజాగా ఐచి-నగోయా గేమ్స్‌లో రజతం సాధించి ఆసియా వేదికపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు.

**1500 మీటర్లలో గుల్వీర్, యూనూస్ దూకుడు:**

పురుషుల 200 మీటర్ల సెమీఫైనల్-3లో భారత స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 20.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలవడంతో, ఫైనల్‌కు అర్హత సాధించారు. థాయ్‌లాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20.10 సెకన్లతో గేమ్స్ రికార్డు సృష్టించారు. అంతకుముందు 100 మీటర్ల ఫైనల్ రేసును కోల్పోయిన అనిమేష్, 200 మీటర్లలో అద్భుతమైన కంబ్యాక్ ఇచ్చి పతక రేసులో నిలిచారు.

ఇక పురుషుల 1500 మీటర్ల ఈవెంట్‌లో భారత్‌కు మరో శుభవార్త అందగా.. హీట్-2లో గుల్వీర్ సింగ్ (3:45.79), హీట్-1లో యూనూస్ షా (3:45.77) తమ విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఎల్లుండి (సోమవారం, సెప్టెంబర్ 28) ఈ పతక పోరు జరగనుంది.

**కబడ్డీలోనూ గోల్డ్ మెడల్:**

ఇదిలా ఉండగా, ఈరోజు (సెప్టెంబర్ 26, శనివారం) జరిగిన పురుషుల కబడ్డీ ఫైనల్‌లో ఇరాన్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ అద్భుతమైన కంబ్యాక్‌తో 39--34 తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. తొలి అర్ధభాగంలో 17--18తో వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత చెలరేగిపోయి భారత్ గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది.

# తిరువనంతపురంలో రోహిత్ ఫ్యాన్స్ రచ్చ.. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం బయట 50 అడుగుల కటౌట్!







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ వెస్టిండీస్ తొలి వన్డే మ్యాచ్‌కు వేదికైన కేరళలోని తిరువనంతపురంలో క్రికెట్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం పరిసరాలు ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రేపు (సెప్టెంబర్ 27, ఆదివారం) జరగనున్న ఈ హైవోల్టేజ్ పోరు కోసం కేరళ ఫ్యాన్స్ ఘన స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా టీమిండియా స్టార్ ఓపెనర్, రోహిత్ శర్మపై తమ అభిమానాన్ని చాటుకుంటూ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రోహిత్ శర్మ 50 అడుగుల కటౌట్:**

ఇండియా వర్సెస్ విండీస్ మ్యాచ్ నేపథ్యంలో ఆల్ కేరళ రోహిత్ శర్మ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియం బయట ఏకంగా 50 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే కేరళ గడ్డపై రోహిత్ కు ఉన్న క్రేజ్ ఏపాటిదో ఈ కటౌట్ తో మరోసారి నిరూపించింది. తిరువనంతపురానికి తరలివస్తున్న క్రికెట్ లవర్స్, అభిమానులు ఈ భారీ కటౌట్ ఎదుట ఆగి

పండగ వాతావరణంలో గ్రీన్ ఫీల్డ్ స్టేడియం:

కేరళలో ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరిగినప్పుడల్లా అభిమానులు భారీ బ్యానర్లు, కటౌట్లతో తమ అభిమాత్వాన్ని చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలు తిరిగి వన్డే జట్టులోకి అడుగు పెడుతుండటంతో ఈ మ్యాచ్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. స్టేడియం బయట కనిపిస్తున్న ఈ కోలాహలం, అభిమానుల కేరింతలు మ్యాచ్‌లోని ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి. ఇరు జట్ల మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధంకావడంతో తిరువనంతపురం క్రికెట్ మాయాజాలంలో మునిగిపోయింది.

# ఆసియా క్రీడలు: కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్.. ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.




# నచ్చకపోయినా కొన్నిసార్లు రాజీ పడక తప్పదు!

గ్లామర్ ప్రపంచంలో వెలిగిపోయే తారల జీవితాలు బయట నుంచి రంగులమయంగా కనిపించినా? దాని వెనుక అనేక ఆర్థిక సవాళ్లు, వృత్తిపరమైన రాజీలు దాగి ఉంటాయనేది పచ్చి నిజం. మనకు నచ్చకపోయినా కొన్నిసార్లు పరిస్థితిని బట్టి రాజీ పడక తప్పదు అంటూ బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తెరపై ఎన్ని వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సినీ పరిశ్రమలోని ఆర్థిక వాస్తవాలు, పరిమితుల వల్ల నటీనటులు ఏమాత్రం ఇష్టం లేని ప్రాజెక్టులను కూడా చేయాల్సి వస్తుందని నిర్మొహమాటంగా వెల్లడించారు.



తమకంటూ సొంత ప్రాధాన్యతలు, కళాత్మక అభిరుచులు ఉన్నప్పటికీ జీవనోపాధి కోసమే నచ్చని పాత్రలను అంగీకరించాల్సి వస్తుందని ఫాతిమా ఓపెన్‌గా చెప్పారు. -మేము సంపన్న కుటుంబాల నుంచి రాలేదు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. కేవలం నటులమే తప్ప సినిమాలకు కోట్లు ఖర్చుపెట్టే నిర్మాతులం కాదు- అంటూ సినీ రంగానికి సంబంధించిన ఆర్థిక చేదు నిజాలను బయటపెట్టారు. చేతిలో ఉన్న తక్కువ





అవకాశాల్లోనే ఉత్తమమైనదాన్ని ఎంచుకుంటూ ముందడుగు వేయక తప్పదని, పరిశ్రమలో టైమింగ్ వరుస విజయాలే అవకాశాల సంఖ్యను నిర్ణయిస్తాయన్నారు.హిందీ చిత్ర పరిశ్రమలో మహిళా నటీమణులకు లభించే పాత్రల పరిమితుల గురించి కూడా ఫాతిమా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పురుష నటులకు నటనలోని పూర్తి స్థాయి నైపుణ్యాన్ని చూపించడానికి అనేక అవకాశాలు దక్కుతాయని, కానీ మహిళల విషయానికి వచ్చేసరికి లోతైన, విభిన్నమైన కోణాలున్న పాత్రలు చాలా అరుదుగా లభిస్తాయన్నారు. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబమని పేర్కొంటూ సమాజంలో ఉన్నట్లే సినిమాల్లోనూ లింగ ఆధారిత పాత్రల పరిమితులు స్పష్టంగా ఉంటాయని విశ్లేషించారు.

సినిమాల్లో మహిళా పాత్రలను చిత్రీకరించే తీరుపై మాట్లాడిన ఫాతిమా నెగెటివ్ లేదా కాంప్లెక్స్ ఛాయలున్న పాత్రల విషయంలో పరిశ్రమ ఇంకా పాత మూస ధోరణుల్లోనే ఉండిపోయిందని అభిప్రాయపడ్డారు. పురుషులకు లభించినట్లుగా సంక్లిష్టమైన, గందరగోళంతో కూడిన సాధారణ మహిళా పాత్రలను హుందాగా చూపించే స్థాయికి బాలీవుడ్ ఇంకా చేరుకోలేదన్నారు. నలుపు-తెలుపుల మధ్య ఉండే సాధారణ మానవ స్వభావాన్ని మహిళా పాత్రల్లో ఆవిష్కరించే ప్రయత్నాలు మరింత ఎక్కువగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఫాతిమా షనా షేక్ తాజా ప్రాజెక్టు విషయానికి వస్తే జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న -హుంకార్-వెబ్ సిరీస్‌లో ఫాతిమా ఏసీపీ జస్లీన్ సింగ్ సోయిన్ అనే పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్‌గా నటించారు. ఒక ఆధ్యాత్మిక గురువుపై పాఠశాల విద్యార్థిని చేసే లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సిరీస్ కథాంశం సాగుతుంది. ఈ కేసును నిర్భయంగా దర్యాప్తు చేసే పోలీస్ అధికారిగా ఫాతిమా నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965